క్లుప్తంగా

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత



వలంటీర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ సునీత

తాళ్లరేవు: మండల పరిధిలోని పలు పంచాయతీల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు ఎంపికైన ముగ్గురు వలంటీర్లకు ఎంపీపీ రాయుడు సునీత నియామక పత్రాలు అందజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ సునీత మాట్లాడుతూ విధి నిర్వహణలో బాధ్యతగా మెలగాలని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.అనుపమ, కార్యాలయ ఏఓ చింతా మోహనకృష్ణ, గాడిమొగ-2 సచివాలయ కార్యదర్శి రాయుడు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

వీరేశ్వర స్వామి అన్నదాన ట్రస్టుకు విరాళం



దాత జయలక్ష్మికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు గ్రామానికి చెందిన కాళ్లకూరి జయలక్ష్మి రూ.10,116 విరాళంగా అందజేశారు. గురువారం ఆమె సొమ్మును ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలకు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది దాతకు ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం ఇచ్చి సత్కరించారు.

19న ఉపాధి హామీ ప్రజా వేదిక

తాళ్లరేవు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఈ నెల 19వ తేదీన తాళ్లరేవులో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.అనుపమ గురువారం తెలిపారు. మండల పరిధిలోని 17 గ్రామ పంచాయతీల్లో 2021–22 సంవత్సరానికి గాను ఎంజీఎన్ఆర్ఈజీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ ద్వారా చేసిన పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించామన్నారు. ఆయా నివేదికలను తెలియజేసేందుకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రజావేదిక ఏర్పాటుచేసినట్లు చెప్పారు.

గంగాలమ్మ జాతర ప్రారంభం



శ్రీరంగనాయకపురంలో సాగుతున్న గంగాలమ్మ అమ్మవారి ఊరేగింపు

తాళ్లరేవు: స్థానిక శ్రీరంగనాయకపురం, గుత్తులవారిపాలెం గ్రామాలు సంయుక్తంగా నిర్వహించే గంగాలమ్మ జాతర మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గంగాలమ్మ అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగించారు. గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో సాగిన ఈ ఊరేగింపులో చిన్నారులు సందడి చేశారు.

ఓచర్ పెయిడ్ సిబ్బందికి జీతాలు పెంచాలి

యానాం: పీడబ్ల్యూడీ ఎస్ఎంఆర్‌లకు రూ.10 వేలు పెంచిన విధంగానే ఓచర్ పెయిడ్ సిబ్బందికి జీతాలు పెంచాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. గురువారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ ఓచర్ పెయిడ్ సిబ్బందికి న్యాయం చేయాలని కోరారు. ఆదిద్రావిడ శాఖ నిధులు యానాంకు ఈ ఏడాది అత్యధికంగా ఎందుకు కేటాయించారంటూ డీఎంకే ఎమ్మెల్యే శివ తదితరులు ప్రశ్నించగా ఎమ్మెల్యే అశోక్ స్పందించారు. గత 25 ఏళ్లుగా యానాంకు ఆదిద్రావిడ శాఖాపరంగా నిధులు సరైన విధంగా రాలేదని, అందుకే ఈ ఏడాది నిధులు పెంచారని బదులిచ్చారు.

అంతర్వేది స్వామికి పూజలు



నరసింహ స్వామివారి ఆలయంలో డాక్టర్ పద్మ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహుని ఆలయంలో స్వామివారికి గురువారం ఏపీ ఎండోమెంట్స్ ట్రిబ్యునల్ మెంబర్ డాక్టర్ ఎం.పద్మ ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆమెకు స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామికి పూజలు అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఆమెకు స్వామి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు.

చెదిరిన చెరువు

- కాలుష్య కోరల్లో మంచినీటి చెరువులు
- చేపల చెరువులుగా, మురికిగుంతలుగా మార్చేస్తున్న వైనం



ఐ.పోలవరం: చెరువు... ఒకప్పుడు గ్రామానికి ఆయువుపట్టు. చెరువు నిండితే సకల సంపదలకు నెలవుగా ఉండేది. చెరువు ఎండితే మనుషులతో పాటు సకల జీవులకు ప్రాణసంకటంగా మారేది. సంపూర్ణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఉన్న రోజుల్లో చెరువుకు అంతటి ప్రాధాన్యముండేది. అయితే కాలగమనంలో చెరువుల్ని కేవలం గ్రామాల్లో మురుగు నీటినంతా నింపడానికో, చేపల చెరువులుగానో మార్చేస్తున్నారు. ఫలితంగా తరతరాలుగా మంచినీటి చెరువులుగా ఉపయోగపడినవి సైతం ప్రస్తుతం కాలుష్యం కోరల్లో చిక్కుకుపోయాయి.

నాటి ప్రాధాన్యమేది

ఐ.పోలవరం మండలంలో సుమారు 26 చెరువులున్నాయి. వాటిలో మురమళ్ల శరభయ్య చెరువు, జి.వేమవరం చెరువుల్ని మాత్రమే రక్షిత మంచినీటి చెరువులుగా ఉపయోగిస్తున్నారు. మిగిలినవన్నీ చేపల చెరువులుగా మారిపోయాయి. మురమళ్ల శరభయ్య చెరువు ద్వారా ఆరు గ్రామాలకు, జి.వేమవరం చెరువు ద్వారా మరో ఆరు గ్రామాలకు పైపులైన్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. గతంలో గ్రామాల్లో ఉన్న చెరువుల గురించి కథలుగా చెప్పుకొనేవారు. కొమరగిరిగుండం చెరువు, మురమళ్ల అప్పన్న చెరువు, కేశనకుర్రు పేర్రాజు చెరువు, అల్లూరి వారి చెరువు.. ఇలా ప్రతీ గ్రామంలో ఉన్న చెరువులకు ఒక ప్రత్యేకత ఉండేది. మహిళలు చెరువుల నుంచే బిందెలతో తాగునీటిని తీసుకెళ్లేవారు. అంతేకాదు గ్రామాల్లో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఈ చెరువు నీళ్లనే పుణ్యజలాలుగా వాడేవారు. గ్రామాల్లో భూగర్భజలాలు పెరగడానికి సైతం చెరువులు ఎంతగానో ఉపయోగపడేవి. సుమారు మూడు దశాబ్దాల క్రితం వరకూ అవన్నీ మంచినీటి చెరువులుగానే కొనసాగాయి. 1990 ప్రాంతం నుంచి క్రమంగా ఒక్కోటి చేపల చెరువుగానో, గ్రామంలోని ఇళ్ల నుంచి వచ్చే మురుగునీటిని దాచే చెరువులుగా మార్చేస్తూ వచ్చారు. మరికొన్నింటిని ఆక్రమించి పంట పొలాలుగా, ఇళ్ల స్థలాలుగా మార్చేసిన ఉదాహరణలున్నాయి.

కలుషితమవుతున్న చెరువులు

భూగర్భ జలాలు కలుషితమైపోతున్న పరిస్థితుల నేపథ్యంలో సురక్షిత నీటిని మాత్రమే తాగాలని అధికారులు సూచిస్తున్నారు. దీంతో చెరువులు నిర్లక్ష్యానికి గురై ఆదాయ మార్గాలుగా మారిపోయాయి. అందుకే ప్రస్తుతం మిగిలినవాటిలో అత్యధికం చేపలు చెరువులుగా మార్చేస్తున్నారు. ఆలయాలు, రజక వృత్తిదారుల నిర్వహణలో ఉన్నవి సైతం చేపల చెరువులుగా మార్చేస్తుండడం పరిస్థితికి అద్దం పడుతోంది. అంతేకాదు ఆయా చేపల చెరువుల్లో నిబంధనలకు విరుద్ధంగా పశు కళేబరాలు మేతగా వేస్తూ నిర్వహిస్తుండడంతో చెరువులతో పాటు సమీప భూములు సైతం కలుషితమైపోతున్నాయి. ఆయా చెరువుల ద్వారా పంచాయతీకి వచ్చే ఆదాయం చూస్తే అంతంత మాత్రమే. ప్రభుత్వం స్పందించి చెరువుల నిర్వహణకు నిధులు కేటాయించి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చెరువుల ప్రాధాన్యం గుర్తించాలి

గ్రామాల్లో చెరువులే కాదు సమీప భూములు సైతం కలుషితమైపోతున్నాయి. ప్రభుత్వం చెరువుల ప్రాధాన్యతను గుర్తించాలి. నిధులను కేటాయించి సక్రమ నిర్వహణకు కృషి చేయాలి.

– ఎస్.వెంకటేశ్వరావు, మాజీ సర్పంచ్, కొమరగిరి

చెరువు నీళ్లే తాగేవాళ్లం

మా చిన్నప్పుడు గ్రామాల్లో చెరువు నీళ్లే తాగేవాళ్లం. వేసవిలోను నీటి ఎద్దడి అనేది ఉండేది కాదు. అప్పట్లో చెరువులను పరిశుభ్రంగా ఉంచేవారు. ఇప్పుడు ఏ చెరువు చూసినా మురికి కంపే..

– పి.శ్యామ్, మురమళ్ల

మత్స్యకార గ్రామాల్లో ఆయుష్ సేవలు

యానాం: నియోజకవర్గ పరిధిలోని మత్స్యకార గ్రామాల్లో మత్స్య సంవర్ధన, మత్స్యకారుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆయుష్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్, ఆయుష్ ఆసుపత్రి అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆర్ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. గురువారం అయ్యన్ననగర్‌లో విషజ్వరాలు, కీళ్లనొప్పులు తదితర వ్యాధులకు రోగులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులతో పాటు జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫిషరీస్ ఏడీ గొంతియ్య, వైద్యులు పాల్గొన్నారు.

స్టీల్ కప్పుల బహూకరణ

అల్లవరం: ఓడలరేవు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం ద్వారా మధ్యాహ్న భోజనంలో కొత్తగా చేర్చిన మెనూ రాగి జావను విద్యార్థులకు అందించేందుకు అవసరమైన స్టీల్ కప్పులను ఎస్‌బీఎంఎం డిగ్రీ కాలేజీ 2002–05 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు గురువారం బహూకరించారు. కార్యక్రమంలో కముజు శివకుమార్, వై.ప్రభాకర్, ఎస్ఎస్ఎన్, జ్యోతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరం

- వాడవాడలా అమరజీవికి ఘన నివాళులు



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి, కమిషనర్ నాయుడు



ముమ్మిడివరంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ కమిడి ప్రవీణ్



బోడసకుర్రులో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి



తాళ్లరేవులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ సునీత తదితరులు

అమలాపురం టౌన్: ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం అజరామరమని అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి, సర్క్యులర్ బజారు ఆవరణలోని శ్రీరాములు విగ్రహానికి చైర్‌పర్సన్‌తో పాటు కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, కౌన్సిలర్లు కట్టోజు సన్నియ్యదాసు, కొల్లాటి దుర్గాబాయి, బండారు గోవిందు, మున్సిపల్ కౌన్సిల్ విప్ బండారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ఆంధ్రుల ఆశయ సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని డీఆర్‌డీఏ పీడీ శివశంకరప్రసాద్, జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి టి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్, కమిషనర్ జి.లోవరాజులతో పాటు పలువురు నాయకులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు.

అల్లవరం: ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములని సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అన్నారు. బోడసకుర్రు సచివాలయంలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఓడలరేవు ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎస్.సుబ్రహ్మణ్యం అధ్యక్షతన పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు.

తాళ్లరేవు: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాయుడు సునీత, ఎంపీడీఓ ఎం.అనుపమ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అమలాపురం రూరల్: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రాంగోపాల్, ఎంపీడీవో కాశీ విజయప్రసాద్‌లు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కి'లేడీ'యే కొంపముంచిందా

- బంగారు ఆభరణాల అపహరణ కేసులో కొత్త కోణం
- సమీప బంధువే నిందితురాలు..!

ఐ.పోలవరం: ఐ.పోలవరం మండలం మురమళ్లలో కాశీ మణి కళావతి, చింతలపూడి గవరమ్మలకు జ్యూస్‌లో మత్తు మందు కలిపి ఇచ్చి బంగారు ఆభరణాలు, నగదు అపహరించుకుపోయిన కేసుకు సంబంధించి పోలీసుల విచారణలో కొత్త కోణాలు వెలుగు చూస్తున్నట్లు సమాచారం. దొంగతనం తాము కళ్లారా చూశామని, మత్తులో ఉన్న కారణంగా ఏమీ చేయలేకపోయామంటూ నిందితుల పేర్లను బాధితులు స్వయంగా పోలీసులకు వెల్లడించినట్లుగా తెలుస్తుంది. కళావతి సమీప బంధువైన ఓ యువతితో పాటు మరో ఇద్దరు యువకులకు ఈ కేసులో సంబంధం ఉన్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నట్లుగా వినికిడి. ఇదే ప్రాంతంలో ఆరు నెలల క్రితం జరిగిన రూ.5 లక్షల విలువైన బంగారం, రూ.55 వేల సొమ్ము చోరీ కేసులోను సదరు యువతికి ప్రమేయమున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. ఆమె గతంలోను స్థానికంగా కొందరు యువకులతో కలిసి పలు నేరాలకు పాల్పడిందన్న చర్చ సాగుతోంది. దీనిపై ఐ.పోలవరం ఎస్ఐ రాజేష్‌ను వివరణ కోరగా కేసుకు సంబంధించి పూర్తి సమాచారం రాబట్టేందుకు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, వివరాలు త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ 'ద్వితీయ' పరీక్షల ప్రారంభం



అమలాపురం ఆదిత్య జూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు

అమలాపురం టౌన్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు అమలాపురం నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఏడు పరీక్షా కేంద్రాల్లో గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. అమలాపురం పట్టణం, రూరల్ మండలాల్లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఆదిత్య, విద్యానిధి, శ్రీచైతన్య, మిరియాం, ఎస్‌కేబీఆర్, ఏఎస్ఎన్, వరం జ్యోతి కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. పరీక్షలకు 2113 మంది హాజరయ్యారని సంబంధిత అధికారులు తెలిపారు. కోనసీమ జిల్లాలో ప్రారంభమైన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరగాయని, జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీస్ అనేది లేకుండా అధికారుల పర్యవేక్షణలో పకడ్బందీగా నిర్వహించినట్లు జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ అధికారి(డీవీఈఓ) ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి 'సాక్షి'కి తెలిపారు. పరీక్షలకు విద్యార్థులు నిర్ణీత సమయం కంటే ముందే కేంద్రాలకు చేరుకుని తమకు కేటాయించిన గదులకు వెళ్లి పరీక్షలు రాశారు. విద్యార్థుల వెంట వచ్చిన తల్లిదండ్రులు తమ పిల్లలకు పలు జాగ్రత్తలు చెప్పి మరీ పరీక్షకు సాగనంపారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, ప్రాథమిక వైద్యం, ఫ్యాన్లు, లైటింగ్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేయడంతో విద్యార్థులు ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్ష రాశారు.

ఉపాధ్యాయునికి షోకాజ్ నోటీసు



అనాతవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ కమలకుమారి

ముమ్మిడివరం: విద్యా బోధనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉపాధ్యాయునికి జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.కమలకుమారి గురువారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. ముమ్మిడివరం మండలం అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల స్థాయిని పరిశీలించగా అంతంత మాత్రంగానే ఉండటంతో ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ఆ తరగతి ఉపాధ్యాయునికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. 24 గంటలలోపు సరైన సమాధానం ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మధ్యాహ్న భోజన పథకం పనితీరుని పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న మెనూపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న విద్యా కానుక ద్వారా అందిస్తున్న షూలు, యూనిఫాం, బెల్ట్ ధరించి పాఠశాలకు రావాలని విద్యార్థులకు సూచించారు. ఆమె వెంట మండల విద్యాశాఖాధికారి బి.రమణశ్రీ,, కాంప్లెక్స్ సీఆర్‌పీ కేఎస్ఆర్ శ్రీనివాస్ ఉన్నారు.

చాంబర్ అదనపు కార్యదర్శిగా సురేష్



సురేష్‌ను అభినందిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపార ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం ది అసోసియేషన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అదనపు కార్యదర్శిగా స్థానిక పొట్టి శ్రీరాములు మున్సిపల్ కాంప్లెక్స్(సర్క్యులర్ బజార్) అధ్యక్షుడు జనిపిరెడ్డి సురేష్ నియమితులయ్యారు. చాంబర్‌లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న సురేష్‌ను అదనపు కార్యదర్శిగా నియమించినట్లు చాంబర్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ అన్నారు. కొత్తగా బాధ్యతుల స్వీకరించిన సురేష్‌ను చాంబర్ ప్రతినిధులు స్థానిక సర్క్యులర్ బజారులో గురువారం సాయంత్రం సత్కరించి అభినందించారు.

ఆస్తి వివాదంలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం

ఉప్పలగుప్తం: అన్నదమ్ముల ఆస్తి వివాదంలో రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన మండలంలోని ఎస్.యానాం గ్రామ పంచాయతీ పరిధి చినపేటలో చోటుచేసుకుంది. ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం ఎస్.యానాం గ్రామం చినపేటకు చెందిన పెదపాటి భీమన్న, పెదపాటి శ్రీనులిద్దరూ అన్నదమ్ములు. వారిద్దరి మధ్య గత కొంతకాలంగా ఆస్తి కోసం వివాదం జరుగుతోంది. గురువారం పెదపాటి శ్రీను స్థానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద కూర్చొన్నాడు. అదే సమయంలో పెదపాటి భీమన్న కుమారుడు రాజేష్ అక్కడకు వచ్చి తన చిన్నాన్న శ్రీనుతో గొడవపడ్డాడు. దీంతో గ్రామస్తులు జోక్యం చేసుకుని శ్రీనుకు మద్దతు పలికారు. దీంతో ఆవేదనకు గురైన రాజేష్ అక్కడున్న అంబేడ్కర్ విగ్రహానికి స్థల దానం చేసింది తన కుటుంబ సభ్యులేనని చెబుతూ విగ్రహాన్ని పక్కనే ఉన్న చెరువులోకి పడేశాడు. పంచాయతీ కార్యదర్శి ఏపీఎల్ నరసింహం ఫిర్యాదు మేరకు పెదపాటి రాజేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు తెలిపారు.

మహిళా సంఘాల ర్యాలీ



కొంకాపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

అమలాపురం రూరల్: నడిపూడి, ఈదరపల్లి, కొంకాపల్లి గ్రామాల్లో బాల్య వివాహాలు, స్కూల్ డ్రాప్ అవుట్స్, బాల కార్మికులు, మహిళలపై అఘాయిత్యాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తూ డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో గురువారం మహిళా సంఘాలు ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా మహిళల్లో రక్తహీనత, పిల్లల్లో పోషకాహార లోపాల గురించి మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం పీవీవీ రమణి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో ఉత్సవాలు విజయవంతం

నూకాంబిక అమ్మవారి జాతర ఏర్పాట్లపై ఆర్డీఓ సమీక్ష



చింతలూరులో నూకాంబిక అమ్మవారి ఉత్సవాలపై సమీక్షిస్తున్న ఆర్డీఓ ముక్కంటి

ఆలమూరు: అధికారులంతా సమన్వయంతో చింతలూరు శ్రీనూకాంబిక అమ్మవారి ఉత్సవాలను విజయవంతం చేద్దామని ఆర్డీఓ ఎం.ముక్కంటి పిలుపునిచ్చారు. గురువారం చింతలూరులో అమ్మవారి ఉత్సవాలపై రెండో విడత సమీక్ష సమావేశం జరిగింది. ఆలయ ముఖ మండప ఆవరణలో ఈఓ ఉండవల్లి వీర్రాజు ఆధ్వర్యాన నిర్వహించిన ఈ సమీక్షకు ఆలయ కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు అధ్యక్షత వహించగా ఆర్డీఓ ఎం.ముక్కంటి, డీఎల్‌పీఓ రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలకు చేయాల్సిన ఏర్పాట్లు, సౌకర్యాల కల్పనపై మండల స్థాయి అధికారులతో చర్చించారు. జాతర, తీర్థ మహోత్సవాలకు విచ్చేసే భక్తులకు తప్పనిసరిగా తాగునీటి సౌకర్యం కల్పించి.. సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని ఆర్డీఓ ఆదేశించారు. తీర్థంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్సై ఎస్.శివప్రసాద్‌కు తెలిపారు. తీర్థంలో అగ్నిమాపక శకటం ఏర్పాటు చేయడంతో పాటు వైద్య శిబిరాలు నిర్వహించాలని, విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, ఈఓపీఆర్డీ పీఆర్‌సీ రాజ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఎం.పోశమ్మ, సబ్ ఇంజినీర్ కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకూ సాగునీరు

అంబాజీపేట: శివారు ప్రాంతాల్లోని ప్రతి ఎకరాకూ సాగునీరు అందించడమే లక్ష్యంగా పంట కాలువల్లో పూడికతీత పనులు చేపట్టామని ఇరిగేషన్ జేఈ జీఎస్ సుందర్‌సింగ్ చెప్పారు. ఇసుకపూడి– చిరతపూడి పంట కాలువలో పేరుకుపోయిన తుప్పలు, చెత్తా చెదారాన్ని పొక్లెయినర్‌తో గురువారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రూ.2.32 లక్షలతో ఈ పనులు చేపట్టామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

130 మందికి కంటి పరీక్షలు

అయినవిల్లి: నేదునూరు ఆరోగ్య ఉప కేంద్రంలో వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా గురువారం కంటి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ గుమ్మడి ప్రసాద్ ప్రారంభించారు. అప్తాలమిక్ ఆఫీసర్ కె.అరవింద్ ఫణికుమార్ 130 మందికి నేత్ర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 80 మందికి కళ్లజోళ్లకు, 39 మందిని శస్త్ర చికిత్సలకు రిఫర్ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు ఇందుగుల వెంకట్రామయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సమస్య రానీయొద్దు



సఖినేటిపల్లిలో పొలంబడి కార్యక్రమం

సఖినేటిపల్లి: మండలంలో దాళ్వాలో వరి చేలకు సాగునీటి సమస్య రాకుండా చూడాలని మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఇంజేటి శామ్యూల్‌రాజ్ అన్నారు. గురువారం సఖినేటిపల్లి సత్తిరేవు పుంత ఏరియాలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. పైరుపై శత్రు, మిత్ర పురుగుల గురించి అవగాహన, పురుగు మందుల వినియోగం, ప్రస్తుతం పైరుపై ఆశిస్తున్న తెగుళ్లు, వాటి నివారణపై అధికారులు సూచనలు చేశారు. సాగు చివరి దశకు చేరుకున్న తరుణంలో నీటి సమస్య రాకుండా చూడాలని పలువురు రైతులు కోరారు. ఏఓ పీవీ నరసింహారావు, సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, వైస్ ఎంపీపీ–1 రాపాక దీవెనకుమారి, ఎంపీటీసీ సభ్యులు కట్టా వెంకాయమ్మ, నల్లి రత్నకుమార్, సలహా మండలి సభ్యుడు కొల్లాబత్తుల చిట్టిబాబు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్‌డీఎం లక్ష్మీనారాయణ

మండపేట: డ్వాక్రా గ్రూపుల్లో సభ్యులకు రుణాల మంజూరు ద్వారా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతానికి బ్యాంకర్లు సహకరించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ లక్ష్మీనారాయణ అన్నారు. జాయింట్ మండల లెవిల్ బ్యాంకర్ల మీటింగ్ గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగింది. నియోజకవర్గంలోని వివిధ బ్యాంకుల మేనేజర్లు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎల్‌డీఎం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ టిడ్కో హౌసింగ్, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి డ్వాక్రా రుణాలు, జగనన్న తోడు తదితర పథకాల అమలుపై సమీక్షించారు. రుణాల రికవరీపై బ్యాంకర్ల సందేహాలను నివృత్తి చేశారు. ఎంపీడీఓ రాజు మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపుల్లో సభ్యులుగా లేని లబ్ధిదారులకు జగనన్న పట్టాపై రుణసాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. డీఆర్‌డీఏ డీపీఎం అన్నపూర్ణ, మెప్మా డీసీఓ శ్రీనివాస్, ఏపీఎంలు రవిరాజా, ధనరాజు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు చినలంక వద్ద గురువారం ఓ వ్యక్తి గాయాల పాలయ్యాడు. కొత్తపేట మండలం పలివెలకు చెందిన లంక బాల వెంకటరమణ తన బైక్‌పై ముక్కామల నుంచి పలివెలకు వెళుతున్నారు. చినలంక వద్ద అదుపు తప్పి పడిపోవడంతో గాయాల పాలయ్యాడని స్థానికులు తెలిపారు. అతన్ని 108లో కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

అంబాజీపేట: ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సర్పంచ్ కోట బేబిరాణి, వైద్యాధికారి గీతాంజలి అన్నారు. గురువారం చిరతపూడి ఎస్ఎస్ నగర్‌లో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన వ్యక్తి డెంగీ బారిన పడి కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొంది సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి వచ్చారన్నారు. ఆ ఇంటికి సమీపంతో పాటు కాలనీ వాసులకు వైద్య పరీక్షలు చేశామన్నారు. ఎవరికైనా జ్వరం, దగ్గు, రొంప తదితర లక్షణాలుంటే తక్షణమే వైద్యులను సంప్రదించాలన్నారు. సబ్ యూనిట్ అధికారి రాజాబాబు, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే చేయాలి

అంబాజీపేట: ప్రస్తుతం ప్రజలు జ్వరాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని, ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యాధికారి వి.గౌతమితో అన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని అంగన్‌వాడీ, ప్రాథమిక, జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు తగు సూచనలు చేసి ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సూదాబత్తుల రాము పాల్గొన్నారు.